క్లుప్తంగా

ప్రగతి పథంలో నడపాలి



సూచనలిస్తున్న సెర్ప్ మేనేజర్ మూర్తి

రేగిడి: స్వయం శక్తి సంఘాలను ప్రగతి పథంలో నడపాలని సెర్ప్ మేనేజర్ డి.మూర్తి సూచించారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీలు, సీఏఫలు, వీవోఏలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. సంఘాలను గ్రేడింగ్‌లు వారీగా విభజించి, వెనకబడిన సంఘాలను ఏ–గ్రేడ్‌లోకి తీసుకురావాలని కోరారు. మొబైల్ బుక్ కీపింగ్ చేసే సమయంలో పారామీటరు ఆధారంగా వీవోఏలంతా మొబైల్ యాప్‌లో సంఘం నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలు నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీ చిరంజీవి, ఏపీఎం గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సారా నియంత్రణపై దృష్టి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎస్‌ఐ ఇమ్మానుయేల్

రేగిడి: సారా నియంత్రణపై దృష్టి సారిస్తున్నామని ఎస్‌ఐ ఇమ్మానుయేల్ అన్నారు. మండలంలోని వెంకంపేట సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన.. మీసాల డోలపేటలో సారా విక్రయాలు జరుగుతున్నాయని, అరికట్టాలని సిబ్బందికి సూచించారు. సారా నియంత్రణలో సచివాలయ సిబ్బంది ప్రముఖ పాత్ర పోషించాలని, సారా తయారు చేసినా, తరలించినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలన్నారు.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా యుగంధర్

తెర్లాం: ఎమ్మార్పీఎస్ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తెర్లాంకు చెందిన బోనెల యుగంధర్ మాదిగను నియమిస్తూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నాంగి నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారని ఆయన శుక్రవారం తెలిపారు. తనను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గాను, జిల్లా సంయుక్త కార్యదర్శిగా బోడెల రవి మాదిగను, జిల్లా అధికార ప్రతినిధిగా కిల్లాడ సురేంద్రకుమార్ మాదిగను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. మాదిగల హక్కులు, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పీ4 సర్వేను వేగవంతం చేయాలి

రేగిడి: మండలంలోని దేవుదళ, చాటాయివలస, కొమెర తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో శ్యామలాకుమారి శుక్రవారం సందర్శించారు. పీ4 సర్వేను వేగవంతం చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. మండలంలో 90 శాతం మేర పీ4 సర్వే పూర్తయిందని, శతశాతం మేర పూర్తి చేయాలన్నారు.

'పీఎం సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలిరూరల్: పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్మవలస సర్పంచ్ పిల్లా వసుంధర్ కోరారు. మండలంలోని కమ్మవలస గ్రామంలో ఆ పథకంపై అవగాహన కల్పిస్తూ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. అధిక కరెంట్ బిల్లులు వచ్చే వారంతా ఈ పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకుని, విద్యుత్ పొందడం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రామభద్రపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. మండల కేంద్రంలో వైద్యాధికారి దిలీప్‌కుమార్‌తో శుక్రవారం సమావేశమైన ఆయన.. ప్రస్తుతం ఎండాకాలంలో కొన్నిరకాల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వేసవిలో తలెత్తే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని సదరు వైద్యాధికారి తెలిపారు.

పొల్యూషన్ బోర్డుకు నివేదిస్తాం

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామ సమీపంలోని ఎస్ఎస్ఆర్ ఎల్లాయ్స్ కంపెనీ ఏర్పాటుపై జాతీయ కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, పర్యావరణవేత్తలు తెలియజేసిన అంశాలను జాతీయ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డుకు నివేదిస్తామని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఏపీ పొల్యూషన్ బోర్డు చీఫ్ డాక్టర్ ప్రసాదరావు తెలిపారు. కంపెనీ ఏర్పాటు జరిగితే తాగునీరు, సాగునీరు కలుషితం కాకుండా చూడాలని, స్థానికులకు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పలువురు కోరారు. ఇవే విషయాలను కాలుష్య నియంత్రణ బోర్డుకు చెబుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుగుణ, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎస్‌ఐ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- అర్బన్ పీహెచ్‌సీల్లో వసతులు కరువు
- చాలీచాలని బెడ్లు, మందులతో అరకొరగా సేవలు
- కనిపించని ఫ్రిజ్, జనరేటర్, ఇన్వర్టర్ సదుపాయాలు
- ఆస్పత్రులకు నిలిచిన వ్యాక్సిన్‌ల సరఫరా
- అవస్థలు పడుతున్న సిబ్బంది, రోగులు



ప్రహరీ లేని బుచ్చింపేట పట్టణ ఆరోగ్య కేంద్రం

వైద్యులున్నా.. వసతులేవీ?

రాజాం: ప్రభుత్వ వైద్యం మసకబారుతోంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్పత్రుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసింది. చాలీచాలని వసతులతోనే వైద్యసేవలు అందించాల్సిన దుస్థితి ప్రతిచోటా నెలకొంది. కొన్నిచోట్ల వైద్యులున్నా తీవ్రంగా వేధిస్తోన్న వసతుల కొరత.. అటు సిబ్బందిని.. ఇటు రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిసారించింది. అప్పట్లో నాడు–నేడు పథకం ద్వారా అటు ప్రభుత్వ బడులు, ఆస్పత్రులను అభివృద్ధి చేసింది. ఆస్పత్రుల్లో అయితే పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంది. అలాగే ప్రతి 25 వేల మందికి ఓ పీహెచ్‌సీ అర్బన్‌లో ఉండాలనే సంకల్పంతో రాజాం పట్టణంలో రెండు పీహెచ్‌సీలను హుటాహుటిన ఏర్పాటు చేయించింది. ఒక్కో చోట రూ.80 లక్షల నిధులతో కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటు చేయడమే కాకుండా వాటిల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించింది. ఒక్కో యూపీహెచ్‌సీల్లో పదేసి బెడ్‌లు చొప్పున అవసరం కావడంతో అప్పట్లో డిస్పోజల్ బెడ్‌లు కేటాయించి సేవలను ప్రారంభించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం.. ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేసింది. ఆస్పత్రుల్లో మెరుగుపరచాల్సిన వసతులను పట్టించుకోవడం లేదు. ఫలితంగా అరకొర సదుపాయాలతోనే వైద్య శాఖ అర్బన్ పీహెచ్‌సీలను నెట్టుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది.



గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమకూర్చిన ఐదు బెడ్లుతోనే ఆస్పత్రి నిర్వహణ



ఆదర్శనగర్ యూపీహెచ్‌సీలో నీరు సరఫరా కాని తాగునీటి కుళాయి కనెక్షన్



ఇలా ఆరుబయటే మందులు, ల్యాబ్ కిట్లు..

వేరే ఆస్పత్రిలో టీకాలు నిల్వ..

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్, బుచ్చింపేట ప్రాంతాల్లోని అర్బన్ పీహెచ్‌సీ(పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ల్లో జనరేటర్లు, ఇన్వర్టర్ల సదుపాయం లేదు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే వీటిని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు.. వాటిల్లో సదుపాయాలు కల్పించాల్సి ఉన్నా ఆ దిశగా ఇంతవరకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఉక్కపోతతో అటు సిబ్బంది.. ఇటు రోగులు నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. ఎంతో విలువైన వ్యాక్సిన్లు రిఫ్రిజిరేటర్లలో నిల్వ ఉంచాల్సి ఉండగా, ఇక్కడ విద్యుత్ సమస్య ఉండడంతో వాటిని(వ్యాక్సిన్లు) తీసుకురావడం లేదు. చిన్నారులకు వేయాల్సిన టీకాలు సైతం ఇతర పీహెచ్‌సీల్లో భద్రపరిచి, అప్పటికప్పుడు వాటిని ఐస్‌బాక్సుల్లో పెట్టి ఇక్కడకు తీసుకువస్తున్నారు. వీటితో పాటు ఆయా పీహెచ్‌సీల్లో తాగునీటి సమస్య కూడా ఉంది. బుచ్చింపేట పీహెచ్‌సీకి కుళాయి వాటర్ సరఫరా చేయకపోవడంతో అక్కడ బోరుబావి ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నారు. ఈ నీరు తాగేందుకు వినియోగపడడం లేదని రోగులు వాపోతున్నారు. ఆదర్శనగర్ పీహెచ్‌సీకి తాగునీటి కుళాయి కనెక్షన్ ఉన్నా మున్సిపల్ అధికారులు నీటి వినియోగానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. వీటన్నింటితో పాటు నైట్ వాచ్‌మన్, ప్రహరీ సదుపాయాలు బుచ్చింపేట పీహెచ్‌సీలో లేవు. దీంతో రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందుబాబులు ఆస్పత్రి ఆవరణల్లో హల్‌చల్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బిక్కుబిక్కుమని వైద్యసేవలు అందించాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.



జనరేటర్ సదుపాయం లేని ఆదర్శనగర్ యూపీహెచ్‌సీ

8 మంది సిబ్బంది.. 5 బెడ్‌లు..

ప్రతి మూడు, ఆరు నెలలకోసారి రోగులకు ఇచ్చే మందులను వైద్య సిబ్బంది సరిచూసుకోవాల్సి ఉంది. ఈ మందుల్లో కాలంచెల్లిన వాటి స్థానంలో కొత్త వాటిని వినియోగించాల్సి ఉంటుంది. ఫ్రిజ్, జనరేటర్ సదుపాయాలు లేక ఇవి సకాలంలో సిబ్బందికి అందడంలేదు. వీటితో పాటు ఒక్కో పీహెచ్‌సీలో కొత్త బెడ్‌లు ఇంతవరకు మంజూరు చేయలేదు. పాత ఐదు బెడ్‌లతోనే కేంద్రాలు నడుపుతున్నారు. ఫలితంగా గతంలో రోజులో ఒక్కో పీహెచ్‌సీకి 50 మందికి పైగా రోగులు ఓపీ నిమిత్తం రాగా, ఇప్పుడు కేవలం 20 నుంచి 40 మధ్య ఓపీ కొనసాగుతోంది. ఒక్కో పీహెచ్‌సీలో వైద్యాధికారితో పాటు మరో ఏడుగురు సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అయితే సరైన సౌకర్యాలు లేకపోవడంతో విలువైన వ్యాక్సిన్‌ల కొరత, ల్యాబ్‌ల ద్వారా సకాలంలో రిపోర్టులు అందకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి, యూపీహెచ్‌సీల వినియోగం లక్ష్యాన్ని చేరేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

జనరేటర్ సమస్య ఉంది..

మా యూపీహెచ్‌సీలో జనరేటర్ సమస్య ఉంది. విద్యుత్ కోత సమయంలో ఇబ్బందులు వస్తున్నాయి. ఇన్వర్టర్లు ఇంతవరకు మంజూరు కాలేదు. తాగునీటి సమస్య కూడా ఉంది. చిన్న చిన్న సదుపాయాలు మెరుగుపరిస్తే ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు భరోసానిచ్చినట్టుంటుంది.

–డాక్టర్ కిరణ్‌కుమార్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి, ఆదర్శనగర్, రాజాం

పేర్లు మార్చడం తప్ప చేసేదేమీ లేదు..

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ధ్వజం

రాజాం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలు, జిల్లాలు, స్టేడియంల పేర్లు మార్చడం తప్ప ప్రజలకు చేసేదేమీ లేదని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మండిపడ్డారు. ఇదే విషయమై ఆయన స్థానిక పట్టణంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించి, మాట్లాడారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా నిరుపేదల ప్రాణాలు నిలబెట్టిన గొప్ప వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, అటువంటి మహానుబావుడి పేరును రాష్ట్రంలో లేకుండా కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పేరును ఎన్‌టీఆర్ వైద్య సేవగా మార్చారే తప్ప కొత్తగా అందిస్తున్న సేవలేమీ చేర్చలేదన్నారు. అలాగే విశాఖపట్నంలోని స్టేడియానికి వైఎస్సార్ పేరును తొలగించి, పైశాచిక ఆనందం పొందుతున్నారని దుయ్యబట్టారు. ఇదిలా ఉంటే ఒక జిల్లాకు ఉన్న ఆయన పేరును కూడా తొలగించాలని చూస్తున్నారని, ఇది అనైతికమని, మంచి పద్ధతి కాదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కృష్ణా జిల్లాకు ఎన్‌టీఆర్ జిల్లాగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టారని గుర్తు చేశారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని కూటమి నేతలకు హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజాం: మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విశాఖపట్నంలోని మధురవాడలో ఉన్న క్రికెట్ మైదానానికి ఉన్న వైఎస్సార్ పేరును తొలగించడం అన్యాయమని ఎంపీపీ ఖండించారు. కూటమి ప్రభుత్వం పేర్లు మార్చడమే తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు.

మహిళల అదృశ్యంపై కేసు నమోదు

బాడంగి: ఇద్దరు మహిళల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని అల్లువానివలసకు చెందిన 21 ఏళ్ల యువతి కనిపించడం లేదని ఆ యువతి తండ్రి, డొంకినవలసకు చెందిన 30 ఏళ్ల వివాహిత కనిపించడం లేదని ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బడి బయట నుంచి బడిలోకి..



రాజాంలోని ఓ పాఠశాలలో బాలుడిని చేర్పిస్తున్న ఎంఈవో దుర్గారావు

రాజాం: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో డ్రాపౌట్స్(చదువు మధ్యలో మానేసి బడి బయట ఉన్న పిల్లలు)ను గుర్తించి, పాఠశాలల్లో చేర్పిస్తున్నామని ఎంఈవో యాగాటి దుర్గారావు తెలిపారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసి, ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. అనంతరం బడి మానేసిన పిల్లల వివరాలపై ఆరాతీశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఎంఈవో కలిసి చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటున్న పిల్లల తల్లిదండ్రులను కలిసి, పిల్లలు స్కూలు మానేయడానికి గల కారణాలపై ఆరాతీశారు. అనంతరం పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం ద్వారా కలిగే ప్రయోజనాలు తెలిపి, వారిని బడిలో చేర్పించేలా చైతన్యం చేశారు. ఇప్పటివరకు మొత్తం 15 మంది చిన్నారులను బడిలో చేర్పించామని ఎంఈవో తెలిపారు.

సంక్షిప్తంగా...

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక పాలకొండ, శ్రీకాకుళం రోడ్లలోని ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఓజేసీఏ కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆవిష్కరణ

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘానికి సంబంధించిన డైరీ, హ్యాండ్‌బుక్‌లను మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం డైరీ ఉపయోగాలను కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక యూనియన్ బ్యాంకులో ఈ నెల 24, 25వ తేదీల్లో బ్యాంకు సిబ్బంది చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు.

23న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 23వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) 122వ సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. డాక్టర్ ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'ఉప్పల లక్ష్మణరావు–మెల్లీ షోలింగర్' అనే అంశంపై రౌతు గణపతిరావునాయుడు ప్రసంగించనున్నారన్నారు. ఈ సమావేశానికి భాషాభిమానులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు హాజరుకావాలని కోరారు.

విద్యారంగ పరిరక్షణకు కృషి

బొబ్బిలి: స్థానిక తాండ్రపాపారాయ మున్సిపల్ స్కూల్‌లో యూటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పారి వెంకటస్వామి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి, ఇతర నాయకులంతా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సంఘ బలోపేతం, విద్యారంగానికి చేసిన కృషిని వక్తలు కొనియాడారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి: పట్టణంలోని మున్సిపల్ మార్కెట్, రావువారి వీధి, జంగాల శివాలయం ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ శుక్రవారం పర్యటించారు. అక్కడి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతీ వీధిలోని కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాలని, పైపులైన్ లీకులను అరికట్టాలని సిబ్బందికి ఆమె సూచించారు.

మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మూడు మెడికల్ షాపుల్లో విజిలెన్స్ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీజీపీ ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడ పేరిట ఆయా అధికారులు దుకాణాలకు వెళ్లి, పరిశీలనలు చేశారు. కాలం చెల్లిన మందులు ఏవైనా ఉన్నాయా.. నకిలీ మందులు ఏవైనా అమ్ముతున్నారా అనే అంశాలను నిశితంగా పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు.

సేంద్రియ ఎరువు తయారు చేయండి

రాజాం సిటీ: చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల్లో సేంద్రియ ఎరువును సక్రమ పద్ధతిలో తయారు చేయాలని డీఎల్‌పీవో మోహనరావు సూచించారు. మండలంలోని సోపేరు ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద క్లాప్ మిత్రలకు ఇస్తున్న రెండో రోజు శిక్షణకు హాజరైన ఆయన.. తడి, పొడి చెత్తను వేరు చేసి, ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని, అక్కడ తయారు చేసే ఎరువును సబ్సిడీపై రైతులకు అందివ్వాలన్నారు. తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: మండల కేంద్రంలోని చెత్త శుద్ధి కేంద్రం వద్ద క్లాప్‌మిత్రలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ శుక్రవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీల వద్దకు చేర్చి, అక్కడ ఎరువు తయారు చేయాలన్నారు. ఆ ఎరువును రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు.

ఆయుధ సామగ్రి డిపోకు భూములివ్వం..



బాడంగిలోని బ్రిటిష్ కాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ వద్ద నావికాదళం ఆయుధ సామగ్రి డిపోకు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములు ఇచ్చేది లేదని పాల్తేరు గ్రామ రైతులు స్పష్టం చేశారు. డిపోకు అవసరమైన స్థల సేకరణ జరుగుతోందని, రైతులపై అధికారుల ఒత్తిడి పెరుగుతోందన్న విషయాలను తెలియజేస్తూ పలు పత్రికల్లో వచ్చిన వార్తలను ఖండిస్తూ ఆ గ్రామ రైతులు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నాకు దిగారు. సీపీఎం నాయకులు పి.శంకరరావు, సురేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతుల తరఫున సర్పంచ్ ప్రతినిధి ఉడమల అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ వంగపండు జోగినాయుడు, ఎంపీటీసీ ప్రతినిధి వంగపండు రమేష్‌లు మాట్లాడారు. పంటభూములనే ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులను అవే భూములు అడిగితే వారెలా బతకాలని ప్రశ్నించారు. ప్రాణత్యాగానికైనా సిద్ధం కానీ భూములిచ్చేది లేదన్నారు. రెవెన్యూ అధికారుల సాయంతో నావికాదళం అధికారులు ఆయుధ సామగ్రి డిపో ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదన్నారు. –బాడంగి

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి



వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన రామభద్రపురంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. చాలీచాలని జీతాలతో వీఆర్‌ఏలంతా ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని కోరారు. అలాగే రెవెన్యూ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మన్, వీఆర్‌వో పోస్టుల్లో వీఆర్‌ఏలను నియమించాలని, నైట్ వాచ్‌మన్, ఇసుక డ్యూటీలను వీఆర్‌ఏలను తప్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలన్నారు. –రామభద్రపురం

దారిలో వాహనాలు... తప్పని బేజారు!



ఈ చిత్రం చూశారా.. కార్యాలయం ముందు కారు.. గేటు వద్ద పలువురి బైక్‌లు. ప్రతి రోజు రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఇదే పరిస్థితి. కార్యాలయంలోకి వెళ్లే మార్గంలో ఇలా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు. కార్యాలయం ఉండడమే ఇరుకు ప్రాంతంలో ఉంది. మరో వైపు కార్యాలయం గేటు మినహా ముందరిభాగం అంతా షాపుల ఆక్రమణలతో నిండిపోయింది. రిజిస్ట్రేషన్ పనిమీదవచ్చే ప్రజలకు లోపలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతుండగా, వాహనచోదకులు తమ వాహనాలు ఎక్కడ పెట్టాలో తెలియక ఇలా దారిలో అడ్డదిడ్డంగా పెట్టేయడం, రోడ్డు మీద పార్కింగ్‌చేసి వదిలేయడం చేస్తున్నారు. ఈ సమస్యకు సంబంధిత అధికారులే పరిష్కారం చూపాలని కోరుతున్నారు. – రాజాం

పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యం



బొబ్బిలి: అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



సంతకవిటి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వృత్యంతర శిక్షణలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమంపై మూడు రోజుల శిక్షణా తరగతులు శుక్రవారమూ కొనసాగాయి. ప్రీస్కూల్ నిర్వహణతో పాటు చిన్నారుల విద్య, ఆరోగ్యం, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ వంటి అంశాలను ఐసీడీఎస్ పీవోలు తెలియజేశారు. ప్రీస్కూల్ విద్యాబోధన మెరుగుపడాలని, పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పూర్వ ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

–బొబ్బిలి, బొబ్బిలిరూరల్, రాజాం సిటీ, రేగిడి, సంతకవిటి, వంగర

త్వరితగతిన రీసర్వే పూర్తి చేయండి



సూచనలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

తెర్లాం: గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం విచ్చేసిన ఆయన.. తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. భూములకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చిన వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫిర్యాదుదారు, లబ్ధిదారునితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో తాత్సారం చేయవద్దని, సకాలంలో సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ సరిహద్దులు గుర్తించినప్పుడు రైతులను దగ్గర ఉంచి హద్దులు వేయాలన్నారు. రీసర్వే చేసే గ్రామాల్లో ముందుగా అవగాహన ర్యాలీ, గ్రామసభ నిర్వహించాలన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి



రాజాం సిటీ: నవధాన్యాల సాగు వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: నవధాన్యాల సాగుతో భూసారం వృద్ధి చెందుతుందని అడిషనల్ డీపీఎం స్వామినాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో మండల స్థాయి కన్వర్జేషన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం అవసరమన్నారు. ఎకరా పొలంలో పప్పుజాతి, నూనెగింజలు, ఆకుకూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, దుంపజాతి వంటి 30 రకాల విత్తనాలు 12 కేజీల చొప్పున వేసుకోవాలన్నారు. తొలకరికి ముందు పొడి వాతావరణంలో వేసుకుని 45 రోజుల తర్వాత కలియదున్నాలని, తద్వారా యూరియా, డీఏపీల వాడకం తగ్గించవచ్చన్నారు. ఇలా మూడేళ్ల పాటు చేస్తే కలుపు నివారణతో పాటు చీడపీడలు, తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం నవధాన్యాల సాగుకు సంబంధించి, వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏవో నవీన్, ఎస్‌పీఎం ఏపీఎం హేమలత, ఏపీఎం భవానీ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని, ప్రకృతి సాగు ద్వారా నేల సారవంతమవుతుందని ఏపీ సీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్ తులసి అన్నారు. మండలంలోని పెదపాలవలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు మంచి ఆరోగ్యాన్నిస్తాయన్నారు. నవధాన్యాలు, చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. అనంతరం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలకు సన్మానం చేశారు.